పెద్దేరు ముంపులో వడ్డాది కాజ్‌వే



కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వరద



పాత వంతెనపై నిలిచిన ట్రాఫిక్

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పెద్దేరుకు వరద పోటెత్తింది. వడ్డాది కాజ్‌వే ముంపునకు గురైంది. పాత వంతెనపై వాహనాలు బారులుదీరడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పెద్దేరు జలాశయ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. గేట్లు ఎత్తి స్పిల్‌వే మీదుగా దిగువకు నీటిని విడుదల చేశారు. ఒక్కసారిగా వరద రావడంతో పెద్దేరులో నీటి ప్రవాహం పెరిగి కాజ్‌వే మునిగిపోయింది. వడ్డాదిలో ఆదివారం వారపుసంత జరగడం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంది. ఇరుకుగా ఉన్న పాత వంతెన మీదుగా వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రానికి ప్రవాహ ఉద్ధృతి తగ్గడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

నేడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాక



విశాఖపట్నం, న్యూస్‌టుడే: జనసేన అధినేత, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 9.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ఇక్కడి నుంచి 9.35 గంటలకు రోడ్డు మార్గంలో విజయనగరం జిల్లా గుర్ల గ్రామానికి బయలుదేరి వెళతారు. అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి సాయంత్రం 4.10గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి 4.15గంటల విమానంలో విజయవాడ బయలుదేరి వెళతారు.

సమాజ రక్షకుడా.. సెల్యూట్

నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి భద్రతలు కాపాడటమే పోలీసుల లక్ష్యం. ఎండావాన, చలీ వేడి, రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. 24 గంటలూ ప్రజలకు అండగా ఉంటారు. విధి నిర్వహణలోనే కొందరు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పలువురు పోలీసులు తమ ప్రాణాలు కోల్పోయారు. సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం. ఈ సందర్భంగా అనకాపల్లి ఎస్పీ కార్యాలయం వద్ద పరేడ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ విజయకృష్ణన్ హాజరుకానున్నారు.

సాగునీటి సంఘాలకు నవ వసంతం



నిర్వహణ లేక పూడికతో నిండిన సాగునీటి కాలువ

తొమ్మిదేళ్ల తరవాత ఎన్నికలు
నేడు నోటిఫికేషన్ విడుదల

వైకాపా హయాంలో నిరాదరణకు గురైన సాగు నీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఊపిరిపోస్తోంది. జలవనరుల బాగోగులను చూసుకునే నీటి సంఘాలను మరలా క్రియాశీలకంగా మార్చబోతుంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తరవాత ఈ సంఘాల ఎన్నికలను నిర్వహించబోతున్నారు. వచ్చేనెల 21 నుంచి 27 వరకు జరగనున్న ఈ సమరానికి సంబంధించి మూడు జిల్లాల కలెక్టర్లు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నింటి పరిధిలో 360 సాగునీటి సంఘాలు, నాలుగు ప్రాజెక్టు కమిటీలు, మూడు పంపిణీ కాలువలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి 40 రోజులపాటు ఈ సాగునీటి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుండడంతో పల్లెల్లో సందడి వాతావరణం కనిపించనుంది.

ఈనాడు, అనకాపల్లి

పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడంతోపాటు ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా సాగునీటి సంఘాలే బాధ్యతాయుతంగా వ్యవహరించేవి. తెదేపా ప్రభుత్వ హయాంలో 2015లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. నీరు-చెట్టు, ఇతర నిధులతో సాగునీటి వనరులు అభివృద్ధి చేసుకున్నారు. వీరి పదవీకాలం పూర్తయిన తర్వాత వైకాపా సర్కారు మరి ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో సాగునీటి వనరుల నిర్వహణ గాడి తప్పింది. పంట కాలువన్నీ పూడికలతో నిండిపోయి దయనీయంగా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొద్దినెలల్లోనే నీటి సంఘాల ప్రాధాన్యం గుర్తించి మరలా ఎన్నికలు నిర్వహిస్తోంది.

- **తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ ప్రాజెక్టు కమిటీలకు వేరుగా ఎన్నికలు నిర్వహిస్తారు.**
- **విశాఖపట్నం జిల్లా పరిధిలో 29 మైనర్ నీటి సంఘాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి.**
- **అల్లూరి జిల్లాలో కూడా 28 మైనర్ నీటి సంఘాలు ఉన్నాయి.**

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- షెడ్యూల్ సోమవారం విడుదల చేస్తారు. ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు అధీకృత అధికారులను నియమిస్తారు.
- ఈనెల 22 నుంచి 31 లోగా సాగునీటి సంఘాల పరిధిలో ఓటర్ల వివరాలన్ని సేకరిస్తారు. 31న ఆయా సంఘాల పరిధిలో వాటిని ప్రదర్శిస్తారు.
- మేజర్, మీడియం, మైనర్ సంఘాల వారీగా వేర్వేరు తేదీల్లో ఈ జాబితాల ప్రదర్శన ఉంటుంది.
- నవంబర్ 21న నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏ) సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.
- నవంబర్ 24న పంపిణీ కాలువ (డిస్ట్రిబ్యూటరీ కెనాల్) పరిధిలో ఎన్నికలు చేపడతారు.
- నవంబర్ 27న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

నియోజకవర్గాల వారీగా సంఘాలు

నియోజకవర్గం	మైనర్	మీడియం	మేజర్
నర్సీపట్నం	38	–	13
పాయకరావుపేట	48	–	3
అనకాపల్లి	23	–	–
ఎలమంచిలి	39	–	–
చోడవరం	53	7	–
మాడుగుల	33	21	–
పెందుర్తి	25	–	–

ఎన్నికల ప్రక్రియ ఇలా..

- మైనర్ నీటి సంఘాలల్లో ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరు అధ్యక్షులు, మరొకరు ఉపాధ్యక్షులుగా ఉంటారు.
- మీడియం, మేజర్ నీటి సంఘాల్లో 12 మంది సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరు అధ్యక్ష, మరొకర్ని కార్యదర్శులుగా అదే రోజు ఎన్నుకుంటారు.
- సాగునీటి సంఘాల్లో ఓటర్లు చేతులు పైకెత్తి ఆమోదం తెలపడం ద్వారా సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలుంటాయి. ఎక్కడైనా ఈ విధానంపై అభ్యంతరముంటే చీటిలపై పేర్లు రాసి ఇమ్మని కోరతారు.

లాభాల తీపి రుచిచూపేలా..

బెల్లం ఉప ఉత్పత్తుల తయారీపై మహిళా రైతులకు శిక్షణ

వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతులను పారిశ్రామికవేత్తలుగా తయారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఆహార శుద్ధి విధానం 2024-29 ప్రభుత్వం విడుదల చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు పెట్టే ప్రతి రూ.లక్ష పెట్టుబడికి రూ. 75 వేలు వివిధ రూపాల్లో తోడ్పాటు అందివ్వాలని నిర్ణయించింది. – అనకాపల్లి, మునగపాక, న్యూస్‌టుడే,



శిక్షణ పొందుతున్న మహిళలు (పాతచిత్రం)

జిల్లాలో చెరకు సాగు అధికం. గతంలో నాలుగు చక్కెర కర్మాగారాలు ఉండేవి. ఇప్పుడు ఒక్కటే నడుస్తుంది. దీంతో చెరకు నుంచి ఎక్కువ మంది రైతులు బెల్లం తయారీకే ఆసక్తి చూపుతున్నారు. బెల్లం దిమ్మల రూపంలో కాకుండా ముక్కలు, పొడి, తేనె రూపంలో తయారీ చేస్తే అధిక ఆదాయం వస్తుందని ఇప్పటికే అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు నిరూపించారు. బెల్లం ఉప ఉత్పత్తులు తయారీ యూనిట్ ఏర్పాటు చేసి వ్యాపార వేత్తలకు అవసరమైన సాంకేతిక సలహాలు, శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలోని కె.కోటపాడు, అనకాపల్లి మండలం కూండ్రం, మాకవరపాలెం మండలం రాజుపాలెంలోని యువ రైతులు శాస్త్రవేత్తల సూచనల మేరకు ఉప ఉత్పత్తులు తయారుచేస్తున్నారు.





బెల్లంతో చేసిన కేకులు

వ్యవసాయంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ రంగంలో ఆదాయ వనరులు పెంచుకోవడంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మహిళా రైతులకు వ్యవసాయంలో ఆధునిక విధానాలు నేర్పడమే కాకుండా ఎక్కువ లాభాలు ఆర్జించేలా ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇంతవరకు ఎస్సీ రైతులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు ఆసక్తి ఉన్న మహిళా రైతులకు అవకాశం కల్పిస్తున్నారు.

ఉప ఉత్పత్తుల తయారీపై..

గ్రామీణ స్థాయిలోనే వ్యవసాయ ఉప ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తే లాభాలు వస్తాయని ఆర్థిక శాస్త్రవేత్తలు తరచూ చెబుతుంటారు. బెల్లం ముక్కలు, పొడి, పాకంతోపాటు బిస్కెట్లు, చాక్లెట్, కేకు, కుకీస్, గవ్వలు, గొట్టాలు వంటివి తయారీ చేసి అమ్మకాలు చేయొచ్చు. దీంతోపాటు చిరుధాన్యాలతో వివిధ చిరుతిళ్లు తయారీపై శిక్షణ ఇస్తారు. ప్యాకింగ్, మార్కెటింగ్ విధానం నేర్పిస్తారు.

ఆసక్తి ఉన్న వారికి శిక్షణ



అనకాపల్లి పరిశోధన కేంద్రంలో బెల్లం ఉప ఉత్పత్తులపై ఉచితంగా శిక్షణ ఇస్తాం. మహిళలు బృందాలుగా వస్తే పరిశోధన కేంద్రంలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ విధానాన్ని నేర్పుతాం. యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం. – పి.వి.కె.జగన్నాథరావు, శాస్త్రవేత్త, అనకాపల్లి పరిశోధన కేంద్రం

ఉచిత ఇసుక పేరుతో ఊడ్చేస్తున్నారు!

- రెండు రోజుల్లో పుట్టుకొచ్చిన టైరు బళ్లు
- రోజుకు వంద టన్నులకుపైగా విక్రయం



చోద్యం వంతెన సమీపంలో జాతరలా ఇసుక తవ్వకాలు

గొలుగొండ, న్యూస్‌టుడే

రెండు రోజులు కిందట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీనరేజీ రద్దు చేస్తూ నదులు, వాగులు, వంకల నుంచి ఎంత కావాలంటే అంత ఇసుక ఉచితంగా తవ్వి, తరలించుకోవచ్చని ప్రకటించారు. నిన్న, మొన్నటివరకు గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన వారంతా ఒక్కసారిగా జూలు విదిల్చారు. ఎక్కడి నుంచి తీసుకువచ్చారో గానీ రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో టైరు బళ్లను సిద్ధం చేశారు. గొలుగొండ - కొయ్యూరు మండలాల మధ్య బొడ్డేవు గెడ్డపై ఉన్న రెండు వంతెనలు, లింగంపేట వద్ద 17 పంచాయతీలకు తాగునీరందించే రక్షిత నీటి పథకం ఉన్నా పట్టించుకోకుండా చెంతనే ఇసుక తవ్వకాలను జాతరలా ప్రారంభించారు. సొంతింటి నిర్మాణం, సామాజిక అవసరాలకు ట్రాక్టర్లు, టైరు బళ్లపై ఇసుకను తవ్వి తరలించుకో వచ్చన్న సీఎం ప్రకటనను ఇసుక మాఫియా తమకు అనుకూలంగా మార్చుకుంది. లింగంపేట, కొత్తమల్లంపేట, చోద్యం, గవిరంపేటకు చెందిన అక్రమార్కులు రైతుల ముసుగులో 60 టైరుబళ్లతో రోజుకు వంద టన్నుల ఇసుకను తరలించి నిల్వ చేస్తున్నారు. ఈ నిల్వలను ట్రాక్టర్ల ద్వారా లోడుకు రూ.4500 నుంచి రూ.5000 చొప్పున విక్రయిస్తున్నారు. వారధుల చెంత తవ్వకాలు చేయవద్దని వారం రోజుల కిందట నర్సీపట్నం సీఐ రేవతమ్మ పొక్లెయిన్, ట్రాక్టర్లు వెళ్లకుండా కందకాలు తవ్వించారు. ప్రస్తుతం వాటిని పూడ్చేసి ఇసుకను తరలిస్తున్నారు. వంతెనలు, తాగునీటి పథకాలకు ముప్పు లేకుండా, సాగు భూములు కోతకు గురవకుండా ఇసుక తవ్వకాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

కట్టడి చేస్తాం

వాగులు, గెడ్డల్లో ఇసుక తవ్వకాలపై ఆంక్షలు లేవు. కానీ కట్టడాలు, నీటి పథకాల సమీపంలో తవ్వకాలు చేయడం నిబంధనలకు విరుద్ధం. గొలుగొండ మండలంలో తవ్వకాలపై దృష్టిసారించి, అక్రమాలను కట్టడి చేస్తాం.

– రమణ, ఆర్‌డీఓ, నర్సీపట్నం

పర్తియాత్రలో ప్రసాదంగా మాడుగుల హల్వా



మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనున్న పర్తియాత్ర సందర్భంగా అనకాపల్లి జిల్లా భక్తుల తరపున మాడుగుల హల్వాను ప్రసాదంగా వినియోగించనున్నారు. మాడుగుల నుంచి భక్తులంతా సాయిగాయత్రి పారాయణం చేస్తూ ప్రత్యేక వాహనంలో హల్వాను పుట్టపర్తి పంపినట్లు సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు.

← వాహనం వద్ద భక్తుల సాయిగాయత్రి పారాయణం

వసతిగృహాల్లో సమస్యలపై హైకోర్టుకు నివేదిక

రావికమతం, న్యూస్‌టుడే: సంక్షేమ వసతిగృహాల స్థితిగతులపై నివేదిక రూపొందించి హైకోర్టుకు సమర్పించనున్నట్లు చోడవరం కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ చెప్పారు. కొత్తకోట ఎస్సీ బాలుర, రావికమతం ఎస్సీ బాలికలు, గర్నికం కస్తూర్బా విద్యాలయం, రావికమతం బీసీ బాలికల వసతి గృహాలను ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, వసతులపై ఆరా తీశారు. భవనాల ప్రస్తుత పరిస్థితి, మరుగుదొడ్లు, విద్యార్థులు ఉండే గదులు, స్టాక్ రూం, వంట గదులను పరిశీలించారు. కొత్తకోటలో ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరిందని సిబ్బంది న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారని ఆరా తీశారు. 93 మంది అని సిబ్బంది చెప్పగా, 65 మందే ఉన్నారేమిటని ప్రశ్నించారు. రావికమతంలో ఎస్సీ బాలికల వసతిగృహ భవనం వర్షానికి కారుతోందని విద్యార్థినులు, సంక్షేమాధికారి రమణ చెప్పారు. ఎస్సై రఘువర్మ, ఏఎస్సై బాలయ్య పాల్గొన్నారు.



రావికమతం వసతిగృహం పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి సూర్యకళ

దేవరాపల్లి: మండలంలోని కస్తూర్బా విద్యాలయం, బీసీ వసతిగృహాన్ని చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు ఆదివారం తనిఖీ చేశారు. సదుపాయాలతో పాటు భోజనం నాణ్యతను పరిశీలించారు. బాలుర వసతిగృహం పరిస్థితిని వార్డెన్ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు.

వంద రోజుల పాలనలో ప్రగతి పరుగులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో ప్రగతి పడకేస్తే.. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో పరుగులు పెడుతోందని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా వాలాబు, దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడుతోపాటు ఆయన కుమార్తె ఓటమిపాలయ్యారని, వైకాపా జిల్లా అధ్యక్ష పగ్గాలు ఆయనకే అప్పగించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. పోలవరం పూర్తయిన వెంటనే రైవాడను రైతులకు అంకితం చేస్తామన్నారు. దేవరాపల్లికి డిగ్రీ కళాశాల, శీతల గిడ్డంగి, బాలికల వసతి గృహం మంజూరు చేయాలని స్థానిక నాయకులు కోరారు. సర్పంచులు పెంటమ్మ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, పుష్ప, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, నాయకులు పి.వి.జి.కుమార్, కిలపర్తి భాస్కరరావు, సురేంద్ర, సూర్యనారాయణ, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో జరిగిన పోటీల్లో 200 మంది పాల్గొన్నారు. వీరిలో 38 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ వెయిట్ లిఫ్టర్ పూజారి శైలజ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, వ్యాయామ ఉపాధ్యాయిని దేవి, నియోజకవర్గ క్రీడల కన్వీనర్ శ్రీనివాస్, నారాయణరావు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ

మన్యంలో మరో మేఘాలకొండ



మన్యంలో మరో మేఘాల కొండ చూపరులను కనువిందు చేస్తోంది. డుంబ్రిగుడ మండలం అరుకు పంచాయతీ కేంద్రానికి సమీపంలోని జైపూర్ కూడలి మీదుగా అటవీ ప్రాంతంలో కృష్ణుడి గుడి కొండల్లో నీలి మేఘాల నడుమ పాలసంద్రంలా మంచు పరచుకుని ఆహ్లాదం పంచుతోంది. అరుకు పంచాయతీ కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

అప్పన్న సన్నిధిలో లయ



తెలుగు సినీనటి లయ ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు. - సింహాచలం, న్యూస్‌టుడే

దారికాసిన ప్రమాదాలు



దొంకాడ వద్ద విరిగిన దీపపు స్తంభాన్ని వైర్లతో కట్టారిలా..

అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారిలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరిగింది. ఈ ఘటనలను పరిశీలిస్తుంటే మానవ తప్పిదాలు, రహదారి నిర్వహణ లోపాలు, వాహనదారుల నిర్లక్ష్యం వంటివి కనిపిస్తున్నాయి.

అగనంపూడి సమీపంలో జాతీయ రహదారిలో దొంకాడ వద్ద విరిగి ప్రమాద భరితంగా ఉన్న దీపపు స్తంభాన్ని అలానే వదిలేశారు. దీన్ని వైర్ల సాయంతో కట్టారు. అయితే ఇది తాత్కాలికమే. లంకెలపాలెం వద్ద విరిగిన ఇనుప గ్రిల్స్ ప్రమాదభరితంగా ఉన్నాయి. అగనంపూడి సమీపంలో రద్దీగా ఉండే దారిలో డివైడర్‌ను ద్విచక్ర వాహనదారులు ప్రమాదభరిత స్థితిలో దాటేస్తున్నారు. రహదారి భద్రత విషయంలో ఎప్పటికప్పుడు అందరూ అప్రమత్తంగా ఉండాల్సిందే.

– ఈనాడు, విశాఖపట్నం



అగనంపూడి సమీపంలో డివైడర్‌ను దాటుతున్న వాహన చోదకులు



లంకెలపాలెం వద్ద విరిగిన ఇనుప గ్రిల్స్

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మహిళా అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి చేస్తోందని ఆ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పారె లక్ష్మి పేర్కొన్నారు. శారదానగర్‌లో ఆదివారం జరిగిన సంఘ జిల్లా స్థాయి సమావేశంలో కో ఛైర్‌పర్సన్ విద్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు కేటాయించే సమయంలో ఏ సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. సమయం, ప్రాంతాలకు అనుగుణంగా వీరి రక్షణను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కొన్ని శాఖలు, విభాగాల్లో మహిళల ఇబ్బందులను అధికారులు గుర్తించాలని కోరారు. కార్యాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో సిబ్బందికి సెలవులతో సంబంధం లేకుండా విధులు కేటాయిస్తున్నారని, వీరికి వార్షిక వ్యక్తిగత సెలవులను 35 నుంచి 40కి పెంచాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.



ఎన్నికైన డివిజన్ కమిటీలతో రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

మహిళా ఉద్యోగుల విభాగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామన్నారు. ఇందుకు ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఒకటో తేదీన జీతాలు అందించడం హర్షణీయమన్నారు. జిల్లా ఛైర్మన్ ఎస్.ఎస్.వి.ఎస్. నాయుడు, కార్యదర్శి డి.లోకరాజు, కోశాధికారి యలమంచిలి శ్రీరామమూర్తి, మహిళా విభాగం జిల్లా ఛైర్‌పర్సన్ వీరవాణి, కార్యదర్శి లక్ష్మి, ఏపీసీపీఎస్ జిల్లా కార్యదర్శి బోయిన చిన్నారావు, వీఆర్వోల సంఘం డివిజన్ అధ్యక్షుడు గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కమిటీల ఎన్నిక

మహిళా విభాగం అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల ఎన్నికలు జరిగాయి. అనకాపల్లి డివిజన్ ఛైర్‌పర్సన్‌గా వి.రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా ఓఆర్ కళతో పాటు కార్యవర్గ పదవుల్లోకి జీవీఎల్ఎన్ ఈశ్వరి, జి.ఝాన్సీ, ఇందు, కె.జ్యోతిలను ఎన్నుకున్నారు. నర్సీపట్నం డివిజన్ ఛైర్‌పర్సన్‌గా హెచ్.త్రివేణి, కార్యదర్శిగా కె.నాగమణిల తోపాటు కార్యవర్గ పదవుల్లోకి ఎన్ఎన్ రత్నం, టి.దేవకాంతం, జీఆర్ఎస్ఎన్ రత్నం, కేవీఎన్ఎల్‌జీ కుమార్, ఎం.అమరావతిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

అనిత నివాసంలో లక్ష్మీనరసింహ యాగం



యాగంలో పాల్గొన్న మంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: సారిపల్లిపాలెంలోని తన నివాసంలో మంత్రి వంగలపూడి అనిత ఆదివారం రాజశ్యామల సహిత లక్ష్మీ నరసింహ యాగాన్ని నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు ఆమెను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ క్రతువు తలపెట్టినట్లు వెల్లడించారు. కొప్పిశెట్టి వెంకటేష్, కొప్పిశెట్టి బుజ్జి, గోసల శ్రీకాంత్, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగైరమ్మ సన్నిధిలో ఆత్మీయ సమావేశం



సమావేశమైన రెండు గ్రామాల ప్రజలు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వారంతా రెండు గ్రామాలకు చెందిన వారు. దశాబ్దాల కిందట జీవనోపాధి కోసం విశాఖ నగరానికి వచ్చి స్థిరపడ్డారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం, అందాలపల్లి గ్రామాలకు చెందిన వారంతా చోడవరం మండలం అడ్డూరులోని మజ్జిగైరమ్మ ఆలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశమయ్యారు. స్వగ్రామ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెండు గ్రామాలకు చెందిన వారు కుటుంబాలతో హాజరయ్యారు. కష్టసుఖాలను పంచుకుంటూ కుటుంబాల స్థితిగతులను తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేసి వనభోజనాలు చేశారు.

23న ఏయూ పాలకవర్గ సమావేశం!

ఈనాడు, విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి (ఈసీ) లేదా పాలకవర్గ సమావేశం ఈనెల 23న నిర్వహించే అవకాశముంది. దీనికి సంబంధించిన అజెండాను ఏయూ అధికారులు ఇప్పటికే ఉన్నత విద్యాశాఖకు పంపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈసీ సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఇందులో విద్యా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు తదితరాలపై చర్చించనున్నారు. సమావేశానికి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వర్చువల్‌గా హాజరయ్యే అవకాశముంది.

పలు కీలక నిర్ణయాల అమలుపై చర్చ

ప్రస్తుత ఈసీకి ఇదే చివరి భేటీ..!



త్వరలో ఈసీ రద్దు..: ప్రస్తుతం ఏయూలో గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గమే కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పాలకవర్గాలను రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. వాటి స్థానంలో బోర్డు ఆఫ్ గవర్నన్స్ (గవర్నింగ్ బాడీ)ని నియమించడంపై సమాలోచనలు జరుగుతున్నాయి. గవర్నింగ్ బాడీ ఏర్పాటయ్యేందుకు కనీసం ఆరు నెలలు పడుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈలోగా ప్రస్తుత ఈసీని రద్దు చేసి.. కొత్త పాలకవర్గాన్ని నియమించే అవకాశం లేకపోలేదు.

నామినీ ఎంపిక ప్రధానం: వీసీ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో యూజీసీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున నామినీలను ఎంపిక చేశారు. వర్సిటీ తరపున ఈసీ నామినీ పేరును ఈనెల 25లోపు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈసీ సమావేశంలో ప్రధానంగా దీనిపై చర్చించనున్నారు.

ప్రొఫెసర్ల నియామకంపై..: మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో అధ్యాపకుల కొరత ఎక్కువగా ఉంది. ఆయా విభాగాల్లో నిబంధనలకు అనుగుణంగా తాత్కాలిక ప్రాతిపదికన ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసు (పీఓపీ), అడ్జంక్ట్ ప్రొఫెసర్లను నియమించేందుకు అనుమతులు తీసుకోనున్నారు.

రెండు డిగ్రీల విధానంపై..: వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోనూ రెండు డిగ్రీల విధానం తీసుకురానున్నారు. కొత్తగా వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభించనున్నారు. వాటి అమలు, అవసరమైన పాఠ్యప్రణాళిక రూపొందించేందుకు అనుమతులు తీసుకోనున్నారు.

కంప్యూటర్ల కొనుగోలుకు..: విద్యార్థుల అవసరాల నిమిత్తం 500 'థిన్ క్లైంట్ సర్వర్ బేస్డ్' కంప్యూటర్లను కొనుగోలు చేయనున్నారు. దీనిపై ఈ-టెండర్‌కు వెళ్లనున్నారు. దీని ద్వారా ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు వీలవుతుంది. అవసరమైతే ప్రభుత్వ నియామకాలకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలకు కూడా వినియోగించుకోవచ్చు. దీనిపై సమావేశంలో చర్చించనున్నారు.

కంప్యూటరీకరణకు..: 'సమర్థ్' ప్రాజెక్టులో భాగంగా వర్సిటీలో అన్ని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఉద్యోగుల సర్వీసు, ఉద్యోగులు, విద్యార్థుల హాజరు, పరీక్షలు, పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఫీజులు తదితర వివరాలను కంప్యూటరీకరణ (డిజిటలైజేషన్) చేయనున్నారు. ఈ ప్రాజెక్టును అమలుచేయడానికి తీర్మానం చేయనున్నారు.

ప్రయోగశాలల ఏర్పాటుకు: ఎలిమెంట్ భవనంలో ఫార్మా, ఆహార పరీక్షల ప్రయోగశాలలు, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. వీలుగా ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకోనున్నారు. దీనికి అవసరమైన యంత్ర సామగ్రిని ఇప్పటికే తెప్పించారు. వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు

సుజల స్రవంతి పూర్తి చేస్తాం

కశింకోట, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలను పురస్కరించుకొని కశింకోట మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. వైకాపా నాయకులు భూసర్వే పేరుతో పేదల భూములను కాజేశారని ఆరోపించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. కన్నూరుపాలెం, సుందరయ్యపేట, తీడ, చరకాం, గ్రామాలలో సీసీ రోడ్లు, అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏడాదిలోపే పూర్తి చేస్తామన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, నాయకులు కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, కర్రి వెంకట సత్యనారాయణ, పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యేలు కొణతాల, రాజు తదితరులు

సీఎం సహాయ నిధికి తపాలా ఉద్యోగుల విరాళం

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయిస్ సహకార పరపతి సంఘం రూ.లక్ష విరాళం అందజేసింది. పల్లె-పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కన్నూరుపాలెం వచ్చిన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, కేఎస్ఎన్ఎస్. రాజు, పీలా గోవింద సత్యనారాయణలకు చెక్కును సంఘ అధ్యక్షులు బి.నూకరాజు, కార్యదర్శి వీరభద్రం, ఉపాధ్యక్షులు కె.సింహాచలం, కిరణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

'విశాఖ డెయిరీలో ఉద్యోగులపై వివక్ష'



విశాఖ డెయిరీ ఉద్యోగుల జీతాల వివరాలు చూపుతున్న మూర్తియాదవ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే : విశాఖ డెయిరీ యాజమాన్యం ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విమర్శించారు. దివంగత తులసీరావు ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగుల పిల్లల పేరిట చేసిన డిపాజిట్ మొత్తం సుమారు రూ.25కోట్లు ప్రస్తుత ఛైర్మన్ ఆడారి ఆనంద్ కాజేశారని ఆరోపించారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఛైర్మన్ బంధువైన ఉద్యోగినికి రూ.లక్ష వేతనం చెల్లిస్తున్నారని, అంతేకాకుండా ఒకేసారి రూ.30వేలు పెంచారన్నారు. ఆమె కంటే పెద్ద చదువులు చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారికి రూ.30వేలకు మించి ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో తాను చేసిన ఖర్చు మొత్తం సర్దుబాటు చేసేందుకు సుమారు రూ.30కోట్ల మేర లెక్కల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఛైర్మన్ భార్య పేరిట డెయిరీ నడుపుతూ నిత్యం విశాఖ నుంచి 25వేల లీటర్ల పాలను అక్కడికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఛైర్మన్ ఇంటికి నెలకు రూ.2లక్షల అద్దె డెయిరీ చెల్లిస్తోందన్నారు. విశాఖ డెయిరీలో ఛైర్మన్ కుటుంబం దోపిడీని ఆధారాల సహా ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కి అందించానని, త్వరితగతిన విచారణ జరిపి డెయిరీని కాపాడాలని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆధీనంలో విద్యా సంస్థలు ఉంటేనే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులను నిలబెట్టుకోగలమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.నాగమణి ఆవిష్కరించారు. అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. పాలకవర్గాల విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందన్నారు. ఈ వ్యవస్థను బతికించుకోవడానికి బడి సమయం కంటే అదనంగా ఒక గంట ఉపాధ్యాయులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహన్‌రావు, ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్, నాయకులు పైడిరాజు, ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ పరిశ్రమలకు ఆర్టీసీ బస్సులు

మధురవాడ, న్యూస్‌టుడే: రుషికొండ ఐటీ హిల్స్‌లోని వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్.ఎం. బి.అప్పలనాయుడు అన్నారు. మధురవాడలోని ఆర్టీసీ డిపోను ఆదివారం ఆయన సందర్శించి పలు విభాగాల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఐటీ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ సూచన మేరకు విజయనగరం, గాజువాక, స్టీల్‌సిటీల నుంచి ఐటీ పరిశ్రమలకు ప్రతి రోజు మూడు బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. వీటిని సోమవారం అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడి పర్యటన రేపు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారని కమిషన్ ప్రధాన కార్యాలయ కార్యదర్శి ఎన్.పద్మజ పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్‌తో సమావేశమై బాలల హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న అంశాలపై చర్చిస్తారు. అనంతరం 11.30 గంటలకు ఎస్పీతో పోక్సో చట్టం అమలు తీరు, బాల్య వివాహాల నివారణపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 12.30కి ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో జిల్లాలో గల బస్టాండ్లలో తల్లి పాలకేంద్రాల ఏర్పాటు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపడుతున్న అంశాలు, మాదక ద్రవ్యాల సరఫరా నియంత్రణలో డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కార్యక్రమాలు, బాలల హక్కుల పరిరక్షణపై డిపో మేనేజర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. 2.30కి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మిక శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేస్తారు.

అటవీ సంపద మాయంపై ఫిర్యాదు



రవాణాకు సిద్ధం చేసిన కలప

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల మండలంలోని కలప మాయంపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీలిగుంట, బోడపాలెం మధ్యలో ఉన్న రక్షిత అటవీ పరిధిలో విలువైన టేకు, అకేషియా, నీలగిరి తోటలను అటవీశాఖ అధికారులు పదిహేనేళ్ల కిందట పెంపకం చేశారని, ఇవన్నీ ఏపుగా ఎదిగాయన్నారు. వీటిపై కన్నేసిన వైకాపా నాయకులు కొన్నేళ్లగా చాలా చెట్లను నరికి అక్రమ రవాణాకు పాల్పడ్డారని, ఈ క్రమంలో చెట్లను గుట్టలుగా వేసి బలిఘట్టంలో మిల్లులకు చేరవేశారని ఆరోపించారు. ఈ క్రమంలో దాదాపు రూ. 2 కోట్ల విలువైన సంపద మాయమైందన్నారు. ఈ అక్రమాలకు పలువురు అటవీశాఖ ఉద్యోగులు సహకారం అందించారని, దీనిపై లోతైన విచారణ చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో విలువైన కలపను ముక్కలుగా చేసి పోగులు పెట్టారన్నారు. తక్షణమే వీటిని స్వాధీనం చేసుకోవాలన్నారు.



నరికివేతకు గురైన చెట్టు మొదలు

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

పాయకరావుపేట: పాయకరావుపేట జీవీఆర్ నగర్‌లో ఆదివారం రాత్రి మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ చేశారు. నక్కపల్లి మండలం గొడిచెర్లలో యు.ఇందిరాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. పదిహేనేళ్ల నుంచి న్యాయవాది కొండలరావు ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం రాత్రి ప్రధాన రహదారి నుంచి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు మెడలోని పుస్తెల తాడు తెంపుకొని పారిపోయాడు. బైకు వెనుక కొంతదూరం పరిగెట్టినా ప్రయోజనం దక్కలేదు. పుస్తెల తాడు విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్‌డ్	206	240
స్కిన్‌లెస్	234	250

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర,** రామచంద్ర: **మార్టిన్** ఉదయం, రెండోఆట, **రివైండ్** మేట్నీ. మొదటిఆట, శ్రీ సత్య: **మా నాన్న,** సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం,** స్క్రీన్2: **లవ్‌రెడ్డి,** వెంకటేశ్వర: **వీక్షణం,** పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్,** షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

అభిజీత్ లేఆఫ్‌ను ఎత్తివేయాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అభిజీత్ కంపెనీ లేఆఫ్ ఎత్తివేసి కంపెనీలో కార్మికుల ఉపాధిని పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళనకు మద్దతుగా ఆదివారం అచ్యుతాపురంలో సీఐటీయూ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. నాయకులు సోమునాయుడు, రాము, వెంకటరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎండా.. వానా ఒకే సమయంలో!

అచ్యుతాపురం, నక్కపల్లి, కోటవురట్ల: వాతావరణ పరిస్థితులతో ఎప్పుడు ఎండకాస్తుందో? ఎప్పుడు వర్షం కురుస్తుందో? తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం తిమ్మరాజుపేటలో ఓ వైపు ఎండ కాస్తున్న సమయంలోనే వర్షం కురిసింది. కోటవురట్ల మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ కాయగా, సాయంత్రం వాతావరణం మారి దట్టంగా మబ్బులు అలుముకున్నాయి. ఈ క్రమంలో భారీ వానపడింది. నక్కపల్లిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

అ వీ ఇ వీ

దేవాలయ పరిసరాలు పరిశుభ్రం

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలెం రామ దేవాలయంలో ఆదివారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. దేవస్థానం ధర్మకర్త విల్లూరి మహలక్ష్మినాయుడు, బొడ్డేడ మురళి, విల్లూరి వంశీ, కర్రి రాము పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుండాలవీధి, లక్ష్మీదేవిపేట, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, కోర్టువీధి, గాంధీనగరం, అంజయ్యకాలనీ, విజయరామరాజుపేట, మిర్యాలకాలనీ, ఏఎంసీ కాలనీ, శ్రీరాంనగర్, రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలకు సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గోపి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రేమసమాజానికి వితరణ

ఎలమంచిలి: కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాథలకు దాతలు ఆదివారం సాయం అందించారు. రాంబిల్లి వీఆర్వో సుబ్రహ్మణ్యం ఆశ్రమంలో అనాథలందరికీ దుస్తులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

29 నుంచి ఆరోగ్య మిత్రల నిరవధిక సమ్మె

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆరోగ్య మిత్రల సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఈ నెల 29 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని వైద్య మిత్ర ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కనకం పేర్కొన్నారు. అనకాపల్లి సీపీఐ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 ఏళ్లుగా పేద రోగులకు సేవలందిస్తున్న సిబ్బందికి పనికి తగిన వేతనం లభించడం లేదన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు నోటీసు అందజేశామన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్ భద్రం, నాయకులు నాయుడు, సోమేష్, దుర్గాప్రసాద్, మూర్తి, రమణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సైన్స్ అండ్ ఆర్ట్స్ జోనల్ మీట్‌కు గురుకుల విద్యార్థులు కె.ప్రవీణ్, కె.సుధీర్, జి.సంజయ్ ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పి.రఘు చెప్పారు. ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో ఈ నెల 18న జరిగిన జిల్లా స్థాయి ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో వీరు గీసిన చిత్రాలకు ద్వితీయ బహుమతికి ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జి.అర్జునరావును జిల్లా సమన్వయాధికారి రూపావతి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఇరటా నరసింహమూర్తి తదితరులు ఆదివారం అభినందించారు.



ఎంపికైన బాలురు

టిడ్కో సముదాయం వద్ద నిలిచిన మురుగు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద ఆదివారం సాయంత్రం మురుగునీరు నిలిచిపోయింది. భరించరాని దుర్గంధంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు చెప్పినా పట్టించుకోకపోవడంతో రాత్రి లబ్ధిదారులు గృహ సముదాయం వద్ద ఆందోళనకు దిగారు. మరమ్మతులు చేయించుకుందామన్నా పైపులైన్‌ల డిజైన్ ఎలా చేశారో తమకు తెలియదని చెబుతున్నారన్నారు. పైపులైన్ల సమస్య పరిష్కరించాలని కోరారు. వాడుక నీరు సైతం బయటకు వెళ్లక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోయారు.



టిడ్కో గృహాల వెనుక ఇదీ పరిస్థితి

ముందుకు సాగని జల్‌జీవన్ పనులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

గ్రామాల్లో దాహార్తిని తీర్చడంతో పాటు ఇంటింటికీ కుళాయి ఏర్పాటు కలగానే మారింది. దీనికోసం కోట్లాది రూపాయలు నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టడంలో జాప్యం ప్రజలకు శాపంలా మారింది. ఏడాది నుంచి సొమ్ములు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. తాగునీటి ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతోంది.



నిరుపయోగంగా పైపులు

జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల పరిధిలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిలోభాగంగా కొత్తగా నీటి ట్యాంకులు, పైపులైన్ల వేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. దీనిలో భాగంగా రూ.80 కోట్ల సొమ్ములు మంజూరు చేశారు. నాలుగు మండలాల పరిధిలో 96 పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటితో పాయకరావుపేట పరిధిలో 2022లో రూ.20 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. తొలి విడతగా కొత్తగా పైపులైన్లు వేశారు. కుళాయిలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి కోసం కొత్తగా వేసిన సిమెంట్ రోడ్లను తవ్వేశారు. ఎస్.నర్సాపురం, కేశవరం, రాజవరం, గజపతినగరాల్లో పనులు చేపట్టారు. ఆరంభంలో పనులు వేగంగానే సాగాయి. అప్పటి వైకాపా ప్రభుత్వం దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. ఏడాది నుంచి నిధులు మంజూరు కాక పనులు నిలిచిపోయాయి. దీంతో ఎక్కడ చూసినా రోడ్డు పక్కన వదిలేసిన పైపులు కనిపిస్తున్నాయి. అంతేగాక ట్యాంకుల నిర్మాణాలు పూర్తికాలేదు. రక్షిత జలాలు ఇంటి వద్దకే వస్తాయని ఆశించిన ప్రజల కోరిక తీరలేదు.



కేశవరంలో అసంపూర్తిగా తాగునీటి ట్యాంకు

✦ పైపుల ఏర్పాటుకు సిమెంట్ రోడ్లను ఇష్టానుసారం తవ్వేశారు. దీనిపై అప్పట్లో పేటకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు కె.సత్తిబాబు తదితరులు అధికారులను నిలదీశారు. రోడ్లకు కొత్తరూపు తీసుకువస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీనికోసం అంబేడ్కర్ కాలనీ, దుర్గాకాలనీ, , శబరికాలనీ, రాజీవ్ నగర కాలనీల్లో పనులు చేపట్టారు. ఇప్పటికీ రెండేళ్లు దాటుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. మండల సర్వసభ్య సమావేశాల్లో జల్‌జీవన్ పనులపై ఫిర్యాదులు చేస్తున్నా స్పందన రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనంద్‌ను వివరణ కోరగా నిధుల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. పనులు పూర్తయ్యేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

వసతిగృహాల్లో మెనూ అమలు తప్పనిసరి

పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ పక్కాగా అమలు చేయాలని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ ఆదేశించారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లిలోని పలు వసతి గృహాలను, కస్తూర్బా బాలికా విద్యాలయాలను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. తిమ్మాపురం కస్తూర్బా విద్యాలయంలో ఉదయం అల్పాహారం పూరీలో బంగాళాదుంప కూర కాకుండా, చట్నీ పెట్టారని విద్యార్థినులు తెలిపారు. దీనిపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఎంతమంది ఉపాధ్యాయినులు ఉంటున్నారని అడగగా, ముగ్గురు ఉంటున్నట్లు విద్యార్థినులు చెప్పారు. విద్యాలయాల్లో ఆహారం, వసతి, చదువు సమస్య ఉంటే 15100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ ఇంటర్ విద్యార్థినులకు సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నక్కపల్లి మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయాన్ని జడ్జి విజయ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం కస్తూర్బా విద్యాలయంలో బాలికలకు వండిపెట్టిన భోజన నాణ్యత పరిశీలించారు. సమస్యలుంటే తెలపాలన్నారు.



ఎస్.రాయవరంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ

ఇరువర్గాల దాడిలో ఐదుగురిపై కేసు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: నర్సీపట్నం లారీ యార్డు, జి.కోడూరులో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న దాడి ఘటనల్లో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దామోదర నాయుడు చెప్పారు. జి.కోడూరుకు చెందిన సేనాపతి శేషు, చవ్వాకుల శ్రీనుకు లారీలు ఉన్నాయి. వీరిద్దరి మధ్య లారీ యార్డులో ఇటీవల గొడవ జరిగింది. జి.కోడూరులో శుక్రవారం వివాదం చోటుచేసుకోగా.. చవ్వాకుల శ్రీను, వీరబాబు తమపై దాడికి పాల్పడ్డారని శేషు, సకిరెడ్డి నానాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువర్గాలకు చెందిన శేషు, వీరబాబుతోపాటు మరో ముగ్గురికి కేసు నమోదైనట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్నేహితుల పిల్లలకు చేయూత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తమతో చదువుకుని మరణించిన స్నేహితుల పిల్లలకు సాయం చేయడానికి పూర్వ విద్యార్థులు చేతులు కలిపారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల్లో చొప్పా బాలకృష్ణ, అల్లు సంధ్యారాణి మృతి చెందారు. వారి పిల్లలకు చేయూత ఇవ్వాలనే లక్ష్యంతో బాలకృష్ణ పిల్లలకు రూ.50వేలు, సంధ్యారాణి పిల్లలకు రూ.25 వేలు డిపాజిట్ చేసి బాండ్లు అందించారు. చిన్నారులకు 18 ఏళ్లు వచ్చిన తరవాత ఈనగదును వారే వినియోగించుకునేలా డిపాజిట్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.



పిల్లలకు డిపాజిట్ బాండ్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వైకాపా ఖాళీ అవడం ఖాయం



జనసేనలో చేరిన వైకాపా కార్యకర్తలతో ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ వైకాపా ఖాళీ అవడం ఖాయమని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తెలిపారు. రాంబిల్లి మండలం కొత్తపేటకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు అచ్యుతాపురంలో జనసేనలోకి చేరారు. వీరికి కండువాలు వేసి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. జనసేన ద్వారా కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు వచ్చేలా పనిచేస్తానన్నారు. నాయకులు మాడేం రాజబాబు, బొడ్డు నారాయణరావు, మాడేం అయ్యప్ప, ప్రసాద్, అప్పలరెడ్డి రాంబాబు, పప్పల నూకన్నదొర, రఘుబాబు, పైడిరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం రూ. 10 వేల కోట్లు మంజూరు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం రూ. 10 వేల కోట్లు మంజూరు చేసిందని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రామన్నపాలెంలో ఎంపీ రమేశ్, ఆవరాజాం కార్యక్రమానికి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు హాజరయ్యారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చొరవతో కేంద్రం నిధులు మంజూరుచేసిందన్నారు. వీటితో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలు చేపట్టాలన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో 30 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించి చరిత్ర సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు నమ్మి అధికారం ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రణాళికబద్ధంగా మౌలికవసతులు కల్పించడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు నిజమైన పండగను తీసుకొచ్చిందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ కూటమి పాలన ప్రజల మంచికోసమేనన్నారు. పల్లెపండగ వల్ల నిజమైన పండగ వచ్చిందన్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, భాజపా నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, కూటమి నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, బైలపూడి రాందాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, మోటూరు శ్రీవేణి, వియ్యపు నానాజీ తదితరులు పాల్గొన్నారు.



రామన్నపాలెంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సీసీ రోడ్లు, కాలువ పనుల్లో నాణ్యతలో రాజీలేకుండా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించారు. బవులవాడ, కొండుపాలెం గ్రామాల్లో ఆదివారం వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బవులువాడలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.90 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జల్‌జీవన్ మిషన్ పనులను వచ్చే వేసవి నాటికి పూర్తి చేయాలన్నారు. మండలంలో 100 మినీ గోకులాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



బవులవాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు

అనకాపల్లి గ్రామీణం, నక్కపల్లి, న్యూస్‌టుడే: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం సంకష్టహర చతుర్థి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గణపతి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు మిశ్రా, కిరణ్ వ్రతం చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం క్షేత్ర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆంజనేయరాజు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. నక్కపల్లి చేనేత కాలనీలోని గణపతి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు, మూలమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

మునగపాక, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేటలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం సంకీర్తనలు ఆలపిస్తూ గ్రామవీధుల్లో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. సరిసా శివ, శరగడం పెదరమణ, మళ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: శారదానగర్ సాయిబాబా మందిరంలో నిర్వహించిన విజయదశమి ఉత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం జరిగాయి. ముందుగా మందిరంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించి, బాబాను పల్లకీలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో సాంబమూర్తిదేవుని శూలాల ఉత్సవాన్ని నవంబరు 11న ఘనంగా నిర్వహిద్దామని ఉత్సవ కమిటీ ఛైర్మన్ బూడిద శ్రీనివాసరావు అన్నారు. మునగపాక సాంబమూర్తి కోవెల ప్రాంగణంలో ఆదివారం గ్రామపెద్దలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులను ఆకట్టుకొనే విధంగా వేదికలను నెలకొల్పి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు టెక్కలి రమణబాబు, కోనపల్లి రామ్మోహనరావు, దిమ్మల నూకరాజు, ఆడారికాశిబాబు, బూడిద రామారావు, బుద్ద వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల అభివృద్ధికి చేయూత

కోటవురట్ల, న్యూస్‌టుడే: పొదుపు సంఘాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సహాయ సహకారాలు అందించనున్నట్లు వెలుగు పీడీ శచీదేవి తెలిపారు. కోటవురట్ల వెలుగు కార్యాలయంలో ఆదివారం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు సంఘాలు వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నట్లు తెలుసుకున్నారు. ఇందులో కొన్ని రకాల ఉత్పత్తులకు బయట డిమాండు ఉండటంతో వీటికి మరింత ప్రచారం కల్పించి అమ్మకాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల అమ్మకాలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఏపీఎం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ శచీదేవి

తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు కోరారు. ఆదివారం రాత్రి ఎలమంచిలి తెదేపా కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి గ్రామస్థాయిలో రికార్డు స్థాయిలో సభ్యత్వాలు జరగాలన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. సభ్యత్వం తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 5 లక్షలు బీమా కింద చెల్లిస్తారన్నారు. సాధారణంగా మరణించిన వ్యక్తికి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఇస్తారన్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, ఇత్తంశెట్టి రాజావెంకటరమణ, ఇత్తం శెట్టి సన్యాసినాయుడు, కాండ్రకోట చిరంజీవి, దాడి ముసిలినాయుడు, సుబ్బయ్యనాయుడు, కొఠారు సాంబ, భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

రాజకీయ విలువలకు నిలువుటద్దం

మునగపాక, న్యూస్‌టుడే: రాజకీయవిలువలకు నిలువుటద్దంగా మాజీ ఎమ్మెల్యే పీవీ రమణ జీవితం నిలుస్తోందని పలువురు వక్తలు అన్నారు. మునగపాకలో ఆదివారం రమణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా నాయకులు బద్దెం సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మొల్లేటి సత్యనారాయణ మాట్లాడుతూ రమణ ఎన్నో పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, కాండ్రేగుల రాము, దాడి శివ తదితరులు పాల్గొన్నారు.



రమణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.వి.నరసింహారావు పేర్కొన్నారు. ఎంపీపీ గొర్లిసూరిబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులకు సమాచారం అందించామన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదదొడ్డిగల్లు, పెద బోదుగల్లం, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట, చినబోదిగల్లం తదితర గ్రామాల్లో ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇళ్లలో చందనం చల్లిన బావుటాలను వీధుల్లో తిప్పిన గుర్రంపై వేసి ప్రత్యేక పూజలు చేశారు.



గుర్రంపై ఉన్న బావుటాలకు పూజలు చేస్తున్న భక్తులు



గీచిన చిత్రాలతో విద్యార్థులు

భాషాభివృద్ధికి భగవద్గీత తోడ్పాటు

మునగపాక, న్యూస్‌టుడే: భాషాభివృద్ధికి భగవద్గీత తోడ్పడుతుందని భీశెట్టి రామలక్ష్మి అన్నారు. పాటిపల్లి మావూళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భీశెట్టి తులసీ, ఉపాధ్యాయులు చదరం రామచంద్రరావు పాల్గొన్నారు.

పాలధర పెంచే వరకు ఉద్యమిస్తాం

మునగపాక, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ తగ్గించిన పాలధరను పెంచేవరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని పాడిరైతులు హెచ్చరించారు. గణపర్తి పాలకేంద్రం ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. దాణా ధర పెంచి పాలధర తగ్గించడం తగదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు విమర్శించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎస్.బ్రహ్మాజీ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. ధర్మవరం-అగ్రహారం పాలకేంద్రం వద్ద రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. అనంతరం వేతన కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనలో శ్రీను, నరసింగరావు, నాయుడు, సూర్యనారాయణ, నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాలకేంద్రం ఎదుట నిరసన

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: శంకరం రైల్వే వంతెనపై దీపాలు వెలగక రాత్రివేళలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
– నర్సింహమూర్తి, అనకాపల్లి

✓: వంతెనపై లైట్లు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– నానాజీ, జీవీఎంసీ ఏఈ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత ఆదివారం ఆత్మీయ సమావేశమయ్యారు. 1982-83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 80 మంది కుటుంబ సభ్యులతో సమావేశానికి హాజరయ్యారు. విశాఖలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ, కృష్ణ, సతీష్, గురుమూర్తి, అరుణ, శేషమణి పాల్గొన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల


నర్సయ్యపేట లేఅవుట్‌లో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన దుకాణాలు


సెంటున్నర స్థలంలో నిర్మిస్తున్న దుకాణాలు

పేరేమో ఇల్లు.. తెరిచారు దుకాణాలు

ఇళ్లు నిర్మించుకుంటామని కాలనీలో స్థలాలు తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వం చీడికాడ రోడ్డులోని నర్సయ్యపేట లేఅవుట్‌లో ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున 450 మందికిపైగా స్థలాలు కేటాయించింది. వీరిలో అర్హులైన వారికంటే నాయకుల అనుచరులే ఎక్కువ మంది ఉన్నారు. ఈ కాలనీ ఆర్అండ్‌బీ రోడ్డుకు పక్కనే ఉండటంతో కొందరు ఇళ్లకు బదులు దుకాణాలను నిర్మించి వ్యాపారాలు ప్రారంభించారు. సుమారు పది వరకు దుకాణాలు ఏర్పాటు కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో కొన్నింటిని అద్దెకు ఇచ్చారు. ఈ విషయాన్ని తహసీల్దారు రామారావు వద్ద ప్రస్తావించగా.. 'బాధ్యతలు తీసుకుని పది రోజులే అవుతోంది. రెవెన్యూ అధికారులతో వెళ్లి కాలనీ స్థలంలో నిర్మించిన దుకాణాలను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటా' మన్నారు.

– న్యూస్‌టుడే, చోడవరం గ్రామీణం

నోటీసులు ఇవ్వకుండా కూల్చేస్తారా?

చోడవరం/ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదలపై కక్షసాధింపులకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆరోపించారు. చీడికాడ రోడ్డులో నర్సయ్యపేట బిట్-2 సర్వే నంబరు 245-3లో జగనన్న కాలనీని ఆనుకొని గాంధీ గ్రామానికి చెందిన ఎలిశెట్టి పద్మ ఇంటి పునాదులను ఈ నెల 18న రెవెన్యూ అధికారులు సిబ్బందితో తొలగించారు. 2018లోనే ఆమెకు రెవెన్యూ అధికారులు ఎల్పీసీ ఇచ్చారని ధర్మశ్రీ చెప్పారు. సీఎం పేషీలో ఉన్నతాధికారులకు ఎవరో ఫిర్యాదు చేశారని, నోటీసులు ఇవ్వకుండా పొక్లెయిన్‌తో పునాదులను తొలగించడమేంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. ఎంపీపీ కాసులమ్మ, సర్పంచి కాసు, నాయకులు వెంట ఉన్నారు.

రాజకీయం చేయవద్దు : ఎమ్మెల్యే

చోడవరం: ఆక్రమణల తొలగింపు ప్రక్రియను రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హితవు పలికారు. అర్హులైన పేదలందరికీ కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. బాధితుల్లో అర్హులుంటే ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నకిలీ ఎల్పీసీపై పోలీసులకు ఫిర్యాదు

నర్సయ్యపేట లేఅవుట్‌లో ఇద్దరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌కు 2024 ఆగస్టులో ఫిర్యాదు వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చాం. ఆ తర్వాతే పునాదులను తొలగించామని తహసీల్దారు రామారావు స్పష్టం చేశారు. 2018లో ఇచ్చినట్లు చెబుతున్న ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ (ఎల్పీజీ) నకిలీదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఇంటింటా పెరటి సేద్యం

సేంద్రియ విధానంలో కాయగూరల సాగు

ఆదర్శంగా కొండ్లకొత్తూరు మహిళలు

చీడికాడ, న్యూస్‌టుడే

మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగినా, తగ్గినా వారికేం బెంగలేదు. ఏరోజూ ఆకుకూరలు, కాయగూరలు కొన్నదీ లేదు. ఇంటింటా పెరటి సేద్యాన్ని వారసత్వంగా కొనసాగుతూ సేంద్రియ విధానంలో కాయగూరలు పండిస్తున్నారు కొండ్లకొత్తూరు మహిళలు.

చీడికాడ మండలం కోనాం గిరిజన పంచాయతీలోని కొండ్లకొత్తూరు గ్రామంలో 46 కుటుంబాలున్నాయి. ఊరంతా విశాలంగా, ప్రతి ఇంటికీ ఖాళీ స్థలం ఎక్కువగా ఉంటుంది. గ్రామంలోని అందరూ ఇంటి ఆవరణతోపాటు ఖాళీ స్థలాల్లో కూరగాయలు పండిస్తున్నారు.


ఇంటి ఆవరణలో పెరటి తోట


కొండ్లకొత్తూరు గ్రామం

వాటిని విక్రయించకుండా పూర్తిగా ఇంటి అవసరాలకే వినియోగిస్తున్నారు. ఏరోజు కావాల్సిన కూరగాయలను ఆ రోజే తెంచి వండుకోవడం చేస్తుంటారు. కూరగాయలతోపాటు పువ్వులు, పండ్ల మొక్కలతో ఊరంతా పచ్చదనంతో కళకళలాడుతోంది.

సొంతంగా విత్తన తయారీ

గిరిజన మహిళలు తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా పెరటి కూరగాయల సాగు చేస్తున్నారు. అవసరమైన విత్తనాలను సొంతంగా తయారు చేసుకుంటారు. కోళ్లు, పశువులు పాడు చేయకుండా ప్రత్యేకంగా రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలంలో బీర, బెండ, ఆనప, అరటి, చిక్కుడు, మిరప, గోంగూర, వంకాయ, కాకర, ఆగాకరతోపాటు బొప్పాయి, సీతాఫలం తదితర పండ్లు, పలు రకాల పూల మొక్కలను పెంచుతున్నారు.

అన్ని కూరలూ పెరట్లోనే..



ఇంటి పెరట్లోనే అన్ని రకాల కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నా. కూరగాయ విత్తనాలను సొంతంగా తయారు చేసుకుంటా. జీవాలు పాడు చేయకుండా చుట్టూ కర్రలతో దడి కట్టాం. కూరగాయల ధరలు పెరిగాయన్న ఆందోళనే లేదు.– బుచ్చమ్మ

ఎన్నడూ కొన్నది లేదు



ఇంటికి అవసరమైన కూరగాయలను ఖాళీ సీజనల్ వారీగా ఏడాది పొడవునా పండిస్తున్నాం. ప్రతిరోజూ సంరక్షణ చర్యలు చేపడుతుంటాం. ఎన్నడూ సంతకు వెళ్లి కూరగాయలను కొన్నది లేదు. వంట చేయడానికి ముందు నచ్చిన కూరగాయలు కోసి తెచ్చి వండుకుంటాం. ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే.. వారికి ఇస్తుంటాం. – నూకాలమ్మ

మట్టితో శివలింగాల ప్రతిమలు


మట్టి శివలింగాలను ట్రేల్లో పేరుస్తున్న బాలలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: శివనామ స్మరణతో ప్రారంభించిన మట్టి శివలింగాల ప్రతిమల తయారీ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. రాజమహేంద్రవరంలోని భోగలింగేశ్వర ధార్మిక సేవా సంఘం సహకారంతో ఈ నెల 4న స్థానిక వాసవీ కల్యాణమండంలో శివలింగాల తయారీని ప్రారంభించారు. లక్ష లింగాల తయారీ పూర్తవడంతో వాటిని రాజమహేంద్రవరం పంపేందుకు ట్రేల్లో సర్ది అట్టపెట్టెల్లో ప్యాకింగ్ చేశారు. వీటిని కాశీ తదితర క్షేత్రాల్లోని నదుల్లో కలపనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి నారాయణరావు పేర్కొన్నారు.

అ వీ ఇ వీ

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో ఆదివారం గణపతి హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆశ్వీయుజ బహుళ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా హోమశాలలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. విఘ్నేశ్వరునికి పంచామృతాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి మాయం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాల్సిన అవసరముందని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందన్నారు. బలిఘట్టంలో నూతనంగా ఏర్పాటైన రామచంద్ర హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, లక్ష్మయ్య, సత్యనారాయణ, బంగార్రాజు, నారాయణరావు పాల్గొన్నారు.

కోనాం నీటి విడుదల

చీడికాడ, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చీడికాడ మండలం కోనాం జలాశయంలోకి 250 క్యూసెక్కుల వరద నీరొచ్చి చేరుతోంది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం నాటికి 99 మీటర్లకు చేరింది. స్పిల్‌వే గేట్లు, కాలువకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ జయరామ్ చెప్పారు.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్ పరిధిలో దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎస్సై తారకేశ్వరరావు సూచించారు. ఎవరైనా అనుమతుల్లేకుండా విక్రయాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని నిరసన

చీడికాడ, న్యూస్‌టుడే: పెంచిన విద్యుత్తు ఛార్జీలను ప్రభుత్వం తగ్గించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దేముడునాయుడు డిమాండు చేశారు. చినకోనాంలో ఆదివారం స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. కేంద్రం చెప్పినపట్లుగా రాష్ట్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీఎస్పీ నియోజకవర్గ సమన్వయకర్త బొట్టా నాగరాజు కొనియాడారు. బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో సాయిబాబాకు నివాళులర్పించారు. ఎంఈవో తలుపులు, ధనార్జున్, చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

జోనల్ మీట్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సైన్స్ అండ్ ఆర్ట్స్ జోనల్ మీట్‌కి గురుకుల విద్యార్థులు కె.ప్రవీణ్, కె.సుధీర్, జి.సంజయ్ ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పి.రఘు చెప్పారు. ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో ఈ నెల 18న జరిగిన జిల్లా స్థాయి ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో వీరు గీసిన చిత్రాలు ద్వితీయ బహుమతికి ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జి.అర్జునరావును జిల్లా సమన్వయాధికారి రూపావతి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఇరటా నరసింహమూర్తి తదితరులు ఆదివారం అభినందించారు.


ఎంపికైన బాలురు

నాటి ప్రణాళికకు నేడు జీవం

బాలికా వసతిగృహాలకు త్వరలో మోక్షం


జె.నాయుడిపాలెంలో వసతిగృహ భవనం

రోలుగుంట, న్యూస్‌టుడే: ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఐదేళ్ల కిందట ప్రతిపాదించిన బాలికా వసతిగృహాలకు (కేజీబీవీ టైప్-4) కూటమి ప్రభుత్వంలో మోక్షం కలగనుంది. ఈ మేరకు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. రోలుగుంట మండలం జె.నాయుడిపాలెం, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, నాతవరం మండలం డి.ఎర్రవరం, మాడుగుల, మాకవరపాలెం తదితర ఎనిమిది ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించారు. ఒక్కో భవనానికి రూ.2.5 కోట్ల చొప్పున కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు గత పాలకులు దృష్టిసారించలేదు. ఫలితంగా భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో 8, 9, 10 తరగతులతోపాటు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించాలంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ భవనాల్లో వార్డెన్‌కు ప్రత్యేక గదితోపాటు సుమారు వందమంది బాలికల కోసం 32 గదులున్నాయి. ప్రస్తుతం వీటిని ఆయా ప్రాంతాల్లోని హైస్కూలు ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారని జీసీడీవో పద్మ చెప్పారు. జె.నాయుడిపాలెం వసతి గృహానికి సంబంధించి సమీపంలో కళాశాల లేదు. ఇక్కడి విద్యార్థులు 7 కి.మీ. దూరంలో ఉన్న కొత్తకోట వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతానికి ఈ వసతిగృహంలో చేరేందుకు 25 మంది దరఖాస్తు చేశారని ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కుమార్ చెప్పారు.

రోడ్డెక్కిన విశాఖ డెయిరీ రైతులు


దండిసురవరం పాలకేంద్రం వద్ద పాల క్యారేజీలు పట్టుకొని ధర్నా చేస్తున్న పాడిరైతులు

చీడికాడ, న్యూస్‌టుడే: పాడి, పశుపోషణ ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో ఆవుపాల సేకరణ ధర తగ్గించడమేంటని విశాఖ డెయిరీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దండిసురవరం, అడవిఅగ్రహారం పాల కేంద్రాల ఎదుట ఆదివారం ధర్నా చేశారు. డెయిరీ యాజమాన్యం పునరాలోచన చేయకపోతే ఆందోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. తెదేపా మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పాల సంఘం అధ్యక్షుడిగా జగన్నాథం



మాకవరపాలెం: జి.కోడూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నిక ఆదివారం జరిగింది. విశాఖ డెయిరీ అధికారులు తెదేపా, జనసేన, వైకాపా నాయకుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. తెదేపాకు చెందిన మళ్ల జగన్నాథంకు 89 ఓట్లు, వైకాపాకు చెందిన అభ్యర్థికి 42 ఓట్లు వచ్చాయి. దీంతో జగన్నాథం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని అధికారులు ప్రకటించారు. అనంతరం పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పల్లె పండగ


ఏఎల్‌పురంలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమాన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చేపట్టిందని రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు యర్రాపాత్రుడు అన్నారు. కొత్తపాలెం, జి.వెంకటాపురం, జి.కోడూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, నాయకులు అల్లు రామునాయుడు, వెంకటరమణ, జోగిపాత్రుడు, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పల్లెల్లో అభివృద్ధి పరుగు పెడుతోందని జడ్పీటీసీ పూర్వ సభ్యుడు తారకవేణుగోపాల్ అన్నారు. ఏఎల్‌పురం పంచాయతీ గొల్లవీధి, బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. గోపాలకృష్ణ, జెమీలు, అప్పలనాయుడు, రమేష్, నూకినాయుడు పాల్గొన్నారు.

పల్లె పండగలో నేడు కె.కోటపాడు: పైడమ్మపేట, మేడిచర్ల, రామయోగిఅగ్రహారం, ఎ.కోడూరు, చౌడువాడ, గొండుపాలెం గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో సాంబశివరావు చెప్పారు.

ఇరువర్గాల దాడిలో ఐదుగురిపై కేసు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: నర్సీపట్నం లారీ యార్డు, జి.కోడూరులో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న దాడి ఘటనల్లో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దామోదరనాయుడు చెప్పారు. జి.కోడూరుకు చెందిన సేనాపతి శేషు, చవ్వాకుల శ్రీనుకు లారీలు ఉన్నాయి. వీరిద్దరి మధ్య లారీ యార్డులో ఇటీవల గొడవ జరిగింది. జి.కోడూరులో శుక్రవారం వివాదం చోటుచేసుకోగా.. చవ్వాకులు శ్రీను, వీరబాబు తమపై దాడికి పాల్పడ్డారని శేషు, సకిరెడ్డి నానాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువర్గాలకు చెందిన శేషు, వీరబాబుతోపాటు మరో ముగ్గురికి కేసు నమోదైనట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి


నూకాలమ్మ గుడి వద్ద గుంత

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఒమ్మలి కాటా కూడలి నుంచి వీజేపురం మీదుగా రావికమతం మండలం బుడ్డిబంద వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. నూకాలమ్మ గుడి వద్ద పైపులు దెబ్బతిని రోడ్డుపై పెద్ద గుంత పడింది. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టి తీసుకువెళ్లి రోడ్డు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సర్పంచి సుంకరి సింహాచలంనాయుడు, మాజీ సర్పంచి నందారపు సన్యాసిరావు తెలిపారు.

పనసలపాడు ఆదివాసీల శ్రమదానం

రోలుగుంట, న్యూస్‌టుడే: రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలను రత్నంపేట శివారు పనసలపాడు ఆదివాసీలు శ్రమదానంతో తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు గుబురుగా పెరగడంతో రాకపోకలు సాగించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శ్రమదానంతో తొలగించామని స్థానికులు గమ్మిల చినబ్బాయి, మంజిల నాగరాజు చెప్పారు.


తుప్పలు తొలగిస్తున్న గిరిజనులు


ట్రాఫిక్‌తో నిత్యం ఇక్కట్లు


ఎ.ఎల్.పురం - శరభన్నపాలెం మార్గంలో ట్రాఫిక్ రద్దీ

గొలుగొండ, న్యూస్‌టుడే: ఎ.ఎల్.పురంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి సోమవారం జరిగే వారపు సంతకు వచ్చే వారంతా గంటల తరబడి నరకం చూడాల్సి వస్తోంది. కాకినాడ, ఏలేశ్వరం, రాజమహేంద్రవరంతోపాటు చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు, పాడేరుకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై దుకాణాలు ఉండటంతో తప్పుకొనేందుకు వీలు పడటం లేదని చోదకులు చెబుతున్నారు. పోలీసు, పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737



నర్సీపట్నం, న్యూస్‌టుడే

?: పాత స్టేట్‌బ్యాంకు రోడ్డులో ట్రాఫిక్ రద్దీతో నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– ఎన్.రామ్మూర్తి, నర్సీపట్నం

✓: అబీద్ కూడలిలోని ట్రాఫిక్ సిబ్బందిని పాత స్టేట్ బ్యాంకు వద్ద విధులు చేపట్టేలా సర్దుబాటు చేస్తాం. – ఉమామహేశ్వరరావు, ఎస్సై

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే



?: నర్సయ్యపేటలో ఆంజనేయస్వామి గుడి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రెండు నెలలు అవుతోంది. ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు. లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.
– జె.సుందరరావు, నర్సయ్యపేట

✓: లోఓల్టేజీ సమస్య లేదు. మరోసారి పరిశీలిస్తాం.
– శ్రీనురాజు, విద్యుత్తు ఏఈ

స్పందనకు వందనం

చెత్త తొలగింపు

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని చైత్రనగర్‌లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది శనివారం తొలగించారు. రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. రహదారిలో వ్యర్థాలు తొలగించక ఎదురవుతున్న ఇబ్బందులపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 20న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నారాయణరావు పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. పట్టణంలో బీఎన్ దారి డివైడర్ల పక్కన పేరుకుపోయిన ఇసుక, మట్టి నిల్వలనూ తొలగించారు.

తాచేరులో పడి ఎద్దు మృతి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: విజయరామరాజుపేట వద్ద ఓ ఎద్దు తాచేరులో పడి మృతి చెందింది. రైతు కోరిబిల్లి అప్పలనాయుడుకు చెందిన ఎద్దు ఆదివారం మేతకు వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పొలాలకు వెళ్లడానికి తాచేరు పక్కన పైపులతో రైతులు దారి ఏర్పాటు చేసుకున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు డైవర్షన్ రోడ్డు దెబ్బతింది. రైతులు ఏర్పాటు చేసుకున్న పైపులను తొలగించిన అధికారులు డైవర్షన్ రోడ్డు మరమ్మతుకు వినియోగించారు. రెండు రోజుల్లో పొలాలకు దారి ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పటివరకు పూర్తి చేయలేదని రైతులు వాపోతున్నారు. పొలాలకు వెళ్లి రావడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నదిలోకి దిగి వెళ్లాల్సి వస్తోందని, ఈ క్రమంలోనే మేతకు వెళ్లి వస్తూ ఎద్దు తాచేరులో దిగిందన్నారు. పైపులను తీసుకువచ్చి పొలాలకు దారి ఏర్పాటు చేయాలని కోరారు.

పైపులు దెబ్బతిని తాగునీరు వృథా



మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఇంటింటి కుళాయిల ఏర్పాటు పేరుతో రోడ్లను తవ్వి వేసిన ట్యాపులు చాలాచోట్ల పగిలిపోయి జీవజలం వృథాగా పోతోంది. స్థానిక కిందివీధి రామాలయం సమీపంలో వాహనాల రాకపోకలకు పైపులు పగిలిపోయాయి. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి-2 11కేవీ ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రగతి కేంద్రం, వెలంపేట, చిన్నమిల్లు ఏరియా, ప్రగతినగర్, జ్యోతి కాటా ఏరియా, నటరాజ్ థియేటర్ ప్రాంతం, సాయి ఐటీఐ, పెందుర్తి పాత గ్రామం, ఎల్ఐసీ కాలనీ, పశువుల ఆసుపత్రి ఏరియా, పెందుర్తి కూడలి, రాతిచెరువు ఏరియా, తమిళ నాడు మార్కెట్, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, పరవాడ

సమస్య: మేజర్ పంచాయతీ పరవాడలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. శునకాలు వీధుల్లో గుంపులుగా తిరగడంతో పిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులను ఇవి వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

– అప్పలనాయుడు, పరవాడ

సమాధానం: మీ ప్రాంతంలో వీధి కుక్కల నియంత్రణకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

– న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: సబ్బవరం మండల కేంద్రం చింతల్‌నగర్‌లో రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల పడుతున్న వర్షాలకు వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోంది. దీనివల్ల దోమలు పెరిగి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వెంటనే చెత్తను తొలగించాలి.

– దుర్గాప్రసాద్, సబ్బవరం

సమాధానం: పరిశీలించి త్వరలో వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం.

– డి.ప్రసాదరావు, సర్పంచి సబ్బవరం

పేదింట బిల్లుల భాగ్యం

ఎన్టీఆర్ గృహ నిర్మాణాల సొమ్ముల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం నిర్ణయం



వెన్నెలపాలెంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా నిర్మించుకున్న ఇళ్లు

పరవాడ, న్యూస్‌టుడే

గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న పేదల ఇళ్లకు వైకాపా ప్రభుత్వం బిల్లులు నిలిపేసింది. లబ్ధిదారులకు గత ఐదేళ్లలో ఎటువంటి చెల్లింపులు చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయగా మరికొందరు ఆర్థిక స్థోమత లేక వివిధ దశల్లో ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. వైకాపా హయాంలో బిల్లులు కోసం 5 ఏళ్లపాటు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లను నిర్మించుకున్న వారికి పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పెందుర్తి నియోజకవర్గానికి 2653 ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.లక్షల చొప్పున నిర్ణయించారు.

క్షేత్ర స్థాయి సర్వే ద్వారా గుర్తింపు..

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు నిర్మాణాలను ఎంతవరకు పూర్తి చేశారనే విషయమై సర్వే చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి సర్వే ప్రారంభించారు. గృహ నిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ హౌసింగ్ బెనిఫిషరీ వెరిఫికేషన్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటి నిర్మాణం ఎంతవరకు పూర్తయింది, ఏ దశలో ఉంది అనే వివరాలతో పాటు లబ్ధిదారుడి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. త్వరలోనే బిల్లులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.



చాలా సంతోషంగా ఉంది..

తెదేపా హయాంలో ఎన్టీఆర్ హౌసింగ్‌లో భాగంగా సొంతింటి కలను నెరవేర్చుకున్నాం. గతంలో రూ.77,500 వరకు బిల్లులు వచ్చాయి. 2019లో ప్రభుత్వం మారడంతో మిగతా బిల్లులు రాలేదు. అధికారులకు పెండింగ్ బిల్లులు గురించి అడిగినా ప్రయోజనం లేకపోయింది. 5 ఏళ్లుగా ఎదురుచూసినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అప్పటి బిల్లులు చెల్లించేందుకు సర్వే చేపట్టడంతో ఇబ్బందులు తీరనున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– రావాడ ఈశ్వరమ్మ, వెన్నెలపాలెం



ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2014-19 వరకు ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లు నిర్మించుకుని బిల్లులు రాని లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయి సర్వే ద్వారా గుర్తించాం. ఎంత మేర బిల్లులు చెల్లించారు, ఇంకా ఎంత చెల్లించాలి అనే వివరాలను లబ్ధిదారులతో మాట్లాడి సమాచారాన్ని సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేశాం. నివేదిక ప్రభుత్వానికి పంపుతాం. సర్వే ఆధారంగా త్వరలోనే బిల్లులు చెల్లింపులు ప్రభుత్వం చేపట్టనుంది.

– ఈ.రామచంద్రరావు, ఏఈ, పరవాడ మండల గృహనిర్మాణ శాఖ

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

మండలం	మంజూరైన గృహాలు	సర్వే చేసిన గృహాలు
పరవాడ	900	748
సబ్బవరం	1148	688
పెందుర్తి	605	452
మొత్తం	2653	1888



పరవాడలో సర్వే చేస్తున్న హౌసింగ్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ దేముడుకి రహదారిపై గోతులను చూపిస్తున్న కాలనీవాసులు

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: గోతులతో అధ్వానంగా మారిన పురుషోత్తపురం - హెచ్‌బీ కాలనీ రోడ్డును బాగు చేయించాలని కాలనీవాసులు 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడిని కోరారు. కాలనీవాసుల విన్నపం మేరకు కార్పొరేటర్ ఆదివారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు ప్రాంతాల్లో రోడ్డు గోతులపడిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రహదారిపై రాళ్లుతేలి ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రజలకు హామీ ఇచ్చారు. కంఫర్ట్ హోమ్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జోగారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ చొరవతో సైకిల్ షెడ్ల నిర్మాణం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింహాద్రి ఎన్టీపీసీ చొరవతో సైకిల్ షెడ్లు నిర్మించారు. ఇక్కడి విద్యాలయాలకు పరిసర గ్రామాలకు చెందిన ఎక్కువమంది విద్యార్థులు సైకిళ్లపై వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. షెడ్లు లేకపోవడంతో సైకిళ్లకు ఎండ, వాన నుంచి రక్షణ లేకుండా పోయింది. వానలకు సైకిళ్లు తడవడంతో తుప్పుపట్టి తొందరగా పాడవుతున్నాయి. విద్యార్థుల సమస్యను ఉపాధ్యాయులు ఎన్టీపీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సంస్థ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.11 లక్షలు మంజూరు చేయడంతో షెడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పరవాడ జెడ్పీ బాలికల పాఠశాలలో షెడ్ నిర్మాణం పూర్తి కాగా జూనియర్ కళాశాలలో పనులు చివరిదశకు చేరుకున్నాయి.



పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన సైకిల్ షెడ్

పునాదులు దాటని సామాజిక భవనం



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన కాపు సామాజిక భవనం

కాపు సామాజిక భవనం(కల్యాణ మండపం) నిర్మించేందుకు ఎప్పుడో ఆరేళ్ల క్రితం వేసిన పునాదులు నేటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. సామాజిక భవన నిర్మాణం కల కలగానే మిగిలిపోతోందని ఆ సామాజిక వర్గం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం మండలం ఇరువాడలో 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పునాదులు పూర్తి చేసే సమయానికి ప్రభుత్వం మారడంతో నిధులు గుత్తేదారుకు అందలేదు. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనివంక కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం పిల్లర్ల కోసం వినియోగించిన ఇనుప చువ్వలు తుప్పుపట్టిపోయాయి. పునాదుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని భవన నిర్మాణాన్ని పూర్తి కాపు సామాజిక వర్గం నేతలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సబ్బవరం

అ వీ ఇ వీ

ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పెందుర్తి యూనిట్ అధ్యక్షుడు అల్లం కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతినెలా పింఛను 5వ తేదీలోగా ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక పరమైన సమస్యలు ఒక్కటి కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రతిసారీ సమస్యలు పరిష్కారమవుతాయని పింఛనుదారులు ఎదురుచూడటం తప్పడం లేదన్నారు. దీపావళిలోగా బకాయిలను విడుదల చేయాలని కోరారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్‌ను చెల్లించాలన్నారు.

పీఠానికిచ్చిన భూములు వెనక్కి తీసుకోవడం హర్షణీయం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం శారదా పీఠానికి ఇచ్చిన 15 ఎకరాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం హర్షణీయమని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతం ముసుగులో అక్రమాలకు పాల్పడిన శారదా పీఠాధిపతి స్వరూపా నందేంద్ర సరస్వతికి కూటమి ప్రభుత్వం బుద్ధి చెప్పిందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, నాయకులు దువ్వి పరమేశ్వరరావు, కె.నరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బార్, పబ్‌లలో తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో శనివారం రాత్రి పోలీసులు నగరంలోని పబ్, బార్‌లను తనిఖీ చేశారు. ఎక్సైజ్ శాఖ జారీచేసిన లైసెన్స్, ఫుడ్ లైసెన్స్, అగ్నిమాపకదళ అధికారులు జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రం, పార్కింగ్, ట్రేడ్ లైసెన్స్ వంటి వాటిని పరిశీలించేందుకు తనిఖీలు జరిపారు. ఆయా బార్, పబ్‌లలో సీసీ కెమెరాలున్నవి.. లేనివి పరిశీలించారు. ఒక పబ్ వద్ద పార్కింగ్ లేదని గుర్తించారు. నిబంధనలకు పాటించని వారికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో ప్రజలు 7995095799 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాల భోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

అనంతుడి పవిత్రోత్సవాలు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో అనంతుడి పవిత్రోత్సవాలు ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి తెలిపారు. 27వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమై, 28న అగ్ని మథనం, 29న పంచామృతాభిషేకం, స్వామివారికి పవిత్రాల సమర్పణ, 30న పవిత్రాల విసర్జన, పూర్ణాహుతి, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవయవదాతల సంఘం సమన్వయకర్తగా దాడి శ్రీను

పెందుర్తి, న్యూస్‌టుడే: ఏపీ శరీర అవయవదాతల సంఘం పెందుర్తి జోన్ సమన్వయకర్తగా స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను నియమితులయ్యారు. ఆ మేరకు సావిత్రీబాయి పులే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి ఆదివారం నియామక పత్రం అందించినట్లు శ్రీను తెలిపారు. పెందుర్తి ప్రాంతంలో అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శ్రీను పేర్కొన్నారు.



దాడి శ్రీనుకు నియామకపత్రం అందిస్తున్న గూడూరు సీతామహాలక్ష్మి



ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తాతయ్యబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముత్యాలు తదితరులు

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బత్తుల తాతయ్యబాబును ఆదివారం తెదేపా సీనియర్ నేత, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు తదితరులు ఆదివారం చోడవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని కలిశారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు చింతకాయల అమ్మోరు, అర్జిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2007-08 బ్యాచ్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినుల కలయికను ఆదివారం నిర్వహించారు. వీరంతా 16 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆట పాటలతో సందడి చేశారు. వారు చేస్తున్న వృత్తి, కుటుంబ వివరాలను వేదికపై వెల్లడించారు. పూర్వ విద్యార్థినుల్లో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా అందరూ కలిసి ఆదుకుంటామని, ఏటా ఒకచోట కలుసుకుందామని తీర్మానం చేసుకున్నారు. అనంతరం అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గెడ్డం ఉమ, మరిశా సంతోషి, నగిరెడ్డి రోజా, బండారు శ్యామల, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్య పరిష్కరించాలని వినతి



భీమిలి ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న పంచగ్రామాల భూముల కమిటీ ప్రతినిధులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల్లోని కాలనీ అసోసియేషన్‌లు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం (పంచగ్రామాల భూముల కమిటీ) ఆదివారం ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును నగరంలో కలిసి వినతులిచ్చి సమస్యలు వివరించారు. ఈ నెల 25వ తేదీన నగరంలో పంచగ్రామాల భూసమస్యపై కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరగనుందని గంటా చెప్పినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. నవంబరు 6వ తేదీన హైకోర్టులో వాయిదా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని వెలగపూడి చెప్పారన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, కోశాధికారి సీహెచ్.సత్యనారాయణ, సభ్యులు హనుమంతరావు, కృష్ణారావు, వి.నరసింగరావు, సూర్యనారాయణ, లక్ష్మీ, రాంబాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవీ నవరాత్రి ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు



ఆర్టీసీ డిపోలో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమ

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం దరి సింహాచలం ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి అమ్మవారికి ఉద్యోగులు ప్రత్యేక పూజలు చేశారు. ముగింపు పూజల్లో ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.రమణారెడ్డి, అదనపు కార్యదర్శి శ్రీనివాసరాజు, కోశాధికారి వీవీవీ మోహన్, జిల్లాలోని పలు డిపోలకు చెందిన అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. డిపో ఉద్యోగులంతా ఐక్యతతో దేవీ నవరాత్రులు జరుపుకోవడం సంతోషకరమని రమణారెడ్డి కొనియాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడంతో ఉద్యోగుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం వంటివి అలవడుతాయన్నారు.

భారీ అన్నసమారాధన

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డి కూడలిలోని శ్రీకనకదుర్గ ఆటో స్టాండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి సన్నిధి వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా చేరుకుని అన్నదానం స్వీకరించారు. సాయంత్రం పురవీధుల్లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించి అనంతరం అప్పికొండ తీరంలో నిమజ్జనం చేశారు. స్థానిక నేతలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నమ్మిదొడ్డి కూడలిలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న అతిథులు, కమిటీ ప్రతినిధులు

గణనాథుడికి సంకటహర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని వేంకటాద్రి ఘాట్ రోడ్డులో కొలువైన క్షేత్ర పాలకుడు ఆయుష్య గణపతి సన్నిధిలో ఆదివారం విశేష పూజలు జరిపారు. వేంకటాద్రి ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో వేకువజామున అర్చకులు వినాయకుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలతో స్వామిని అలంకరించి అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో లంబోధరుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాకాసి గుంతలు.. ప్రమాదానికి నిలయాలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జెఎన్ ఫార్మాసిటీలోని గ్రాన్యూల్స్ యూనిట్-5 కంపెనీ మార్గంలో రహదారి ధ్వంసమైంది. ఇక్కడ రహదారిలో పెద్దపెద్ద గుంతలు పడటంతో పాటు రాళ్లుతేలడంతో రాకపోకలు సాగించడానికి ఇక్కట్లు తప్పడం లేదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా కార్మికులు, ఉద్యోగులతో పాటు భారీ వాహనాలతో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షపు నీరు గుంతల్లో చేరి లోతు తెలియక వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక్కడ కాలువల నిర్మాణం జరగకపోవడంతో వరద నిలిచిపోయి రోడ్లు దెబ్బతింటున్నాయని కార్మికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.



రహదారిలో భారీ గుంతలు

వేగ నిరోధకాలపై రంగులు

వేపగుంట, న్యూస్‌టుడే

బీఆర్టీఎస్, ప్రహ్లాదపురం రహదారిలో ప్రమాదాల నివారణ కోసం జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వేగనిరోధకాలు నిర్మించారు. ఇవి దగ్గరకు వచ్చే వరకు ప్రయాణికులకు కనిపించకపోవడంతో ప్రమాదాలు మరింత ఎక్కువయ్యాయి. వేగ నిరోధకాలపై తెలుపు రంగులు, రేడియం స్టిక్కర్లు వేయాలని ప్రజలు నిరసన తెలిపారు. దీనిపై 'బీఆర్టీఎస్‌లో అడుగడుక్కీ గండం' శీర్షికతో ఈనెల 17న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు స్పందించారు. ట్రాఫిక్ ఎస్ఐలు విజయ్‌కుమార్, ఎస్.నర్సింగరాజు పర్యవేక్షణలో వేగనిరోధకాలపై తెలుపు రంగు వేయించడంతో పాటు పలుచోట్ల రేడియం స్టిక్కర్లు అమర్చారు. తెలుపురంగు మధ్యలో కొద్దిరోజుల తర్వాత ఎరుపురంగు వేయించడం జరుగుతుందన్నారు.

ఈనాడు కథనానికి స్పందన



వేగనిరోధకాలపై తెలుపు రంగు వేసే పనులను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎమ్మెల్యే కార్యాలయం రోడ్డులో మురుగు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డులో మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ 95వ వార్డు పరిధి సుజాతనగర్ 80 అడుగుల రహదారిలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతోంది. పెద్దఎత్తున మురుగు బయటకు వచ్చి రోడ్డుపై ప్రవహించడంతో అపరిశుభ్రంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన దుర్వాసనతో వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్నామని పాదచారులు, ద్విచక్రవాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



దర్పణం

వరదనీటితో తప్పని తిప్పలు..

వేపగుంట, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రజలు అవస్థలు తప్పడం లేదు. జీవీఎంసీ 93వ వార్డు సమతాకాలనీలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. రహదారి మధ్యలో కాలువ ఉండటంతో దానిపై ఎత్తుగా కల్వర్టు కట్టారు. దీంతో కల్వర్టు అవతల, ఇవతల నీరు నిలిచిపోతోంది. కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లే మార్గం లేకుండా పోయింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారిలోని కల్వర్టు వద్ద నిలిచిపోతున్న నీరు